# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-10-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **వైయస్సార్ కడప జిల్లాలో జల జీవన్ మిషన్-అమరజీవి జలధార కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఈరోజు ప్రారంభిస్తారు.**

**2.** **ఉద్యాన పంటల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ తెలిపారు.**

**3.** **గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సహకార సంఘాలు కీలకమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.**

**4.** **ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య పర్యాటకం, ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.**

==========================

వైయస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో జల జీవన్ మిషన్-అమరజీవి జలధార కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఈరోజు ప్రారంభిస్తారు. ఇందులో భాగంగా పర్యటన ఏర్పాట్లను జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్. సవిత నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 30 వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 50 వేల 315 నీటి సరఫరా పనులు చేపట్టనున్నామని తెలిపారు.

వాయిస్ ..25.. సెకన్లు

--------------------------

రైతుల సంక్షేమం, పేదల గృహ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అదనపు నిధులు, అనుమతులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు రెండు వేర్వేరు లేఖలు రాశారు. ఖరీఫ్-2026లో పీఎం-ఆశా పథకం కింద 9 రకాల పంటలను ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్ ద్వారా వంద శాతం కొనుగోలు చేసేందుకు ముందస్తు అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే హౌసింగ్ ఫర్ ఆల్ కార్యక్రమంలో భాగంగా మరో 6 లక్షల ఇళ్లను మంజూరు చేయాలని కోరారు.

--------------------------

ఉద్యాన పంటల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాళహస్తి పర్యటనలో భాగంగా వేదం గ్రామంలో సాగు చేస్తున్న ఉద్యాన పంటలను కేంద్ర మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు ఆదాయ వనరుల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులకు గిడ్డంగులు, ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పరికరాలను మరింత అందుబాటులోకి తీసుకురావాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేశారు. కాగా అంతకుముందు కేంద్ర మంత్రి శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

---------------------------

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సహకార సంఘాలు కీలకమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం బ్రాహ్మణపల్లిలో అమూల్ సంస్థకు చెందిన సాబర్ డెయిరీ తెలంగాణ ప్రాజెక్టుకు కేంద్రమంత్రి నిన్న భూమిపూజ చేశారు. అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ, పాల ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉందని తెలిపారు. శ్వేత విప్లవంలో తెలంగాణ కీలక పాత్ర పోషించాలని, రాష్ట్రంలో కొత్తగా 1,525 సహకార సంఘాల ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని కిషన్‌రెడ్డి తెలియజేస్తూ..

వాయిస్..30.. సెకన్లు

---------------------------

సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల సంక్షేమ శాఖ అధికారులతో తిరుపతిలో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న దుస్తులు, బూట్లు వంటి సౌకర్యాలు ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా అందించాలని సూచించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, విద్యార్థుల ప్రగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

---------------------------

వైద్య రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించేందుకు వైద్య సదస్సులు దోహదపడతాయని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎలక్ట్రో కార్డియాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐసెకాన్-2026 జాతీయ వైద్య సదస్సులో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆరోగ్య పర్యాటకం, ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి వైద్యులు సహకరించాలని కోరారు. ఇతర ప్రాంతాల నుంచి చికిత్స కోసం వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచిస్తూ....

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా టెక్కలి-ఇచ్ఛాపురం జాతీయ రహదారి మరమ్మతు పనులు తక్షణమే చేపట్టాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో టెక్కలి నుంచి ఇచ్ఛాపురం వరకు జాతీయ రహదారిపై పలుచోట్ల పెద్ద గోతులు

ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మంత్రి సమీక్షించారు. ఈ మేరకు జాతీయ రహదారుల అధికారులతో మాట్లాడి రహదారి పరిస్థితిని తెలుసుకున్నారు. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు.

---------------------------

ఉద్యాన రంగం అభివృద్ధి, రైతుల ఆదాయం పెంపే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాయలసీమలో ఉద్యాన రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్-రైజింగ్ రాయలసీమ కార్యక్రమం కింద పెట్టుబడుల కోసం ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు సూక్ష్మ సేద్యం, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. రైతులకు పంట నష్ట సమయంలో ఆర్థిక భరోసా కల్పించేందుకు పంటల బీమాను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని బనగానపల్లెను అభివృద్ధిలో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో నిర్మాణంలో ఉన్న నూతన ఆర్డీవో కార్యాలయ భవనం, డ్రైనేజీ, బైపాస్ రహదారి పనులను మంత్రి నిన్న పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యతా ప్రమాణాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలో పలు అభివృద్ధి పనులకు ఆయన నిన్న శంకుస్థాపన చేశారు. ఎర్రుపాలెం రింగ్ కూడలి నుంచి స్టేషన్ రోడ్డు వరకు ఐదు కోట్ల 35 లక్షల రూపాయలతో చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే రామాపురం నుంచి కొత్తపాలెం వరకు 6 కోట్ల 50 లక్షల రూపాయలతో నిర్మించనున్న మరో రహదారి పనులకు కూడా ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి ఎంతో కీలకమని అన్నారు. మెరుగైన రహదారుల వల్ల ప్రజలకు రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు, గ్రామాల అభివృద్ధికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు.

---------------------------

దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ దాని పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి ఒకటిన్నర కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అలాగే ఆంధ్రప్రదేశ్, యానాం పరిసర ప్రాంతాల్లో దిగువ ట్రోపో ఆవరణంలో ఆగ్నేయ, నైరుతి దిశల నుంచి గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

అలాగే తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈరోజు, రేపు ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.

====================